


# పీఎస్‌బీలపై మోదీ కత్తి

## ఐదేండ్లలో 7,189 శాఖలు మూసివేత

## అంతకంతకూ పడిపోతున్న నియామకాలు


## పెరుగుతున్న ప్రైవేట్ రంగ బ్యాంకు శాఖలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): బ్యాంకుల జాతీయాకరణ లక్ష్యానికి కేంద్రంలోని బీజేపీ సర్కారు తూట్లు పొడుస్తున్నది. సామాన్యుడికి తక్కువ వడ్డీకే రుణాలివ్వడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయడమే లక్ష్యంగా ఏర్పాటైన ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) గత తొమ్మిదేండ్ల బీజేపీ పాలనలో వాటి ప్రాభవాన్ని కోల్పోతున్నాయి. 2017-22 మధ్య 7,189 పీఎస్‌బీ శాఖలు మూతబడితే, 13,211 ప్రైవేట్ బ్యాంక్ శాఖలు ఏర్పాటయ్యాయి. 2021-22 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ బ్యాంకు శాఖలు 2,044 తగ్గితే, ప్రైవేట్ బ్యాంకు శాఖలు 4,023 మేర పెరిగి 34,342కు చేరినట్టు ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) తెలిపింది. బ్యాంకుల విలీనం, శాఖల కుదింపు ప్రభావం 75 శాతం మేర ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐపైనే పడినట్టు ఆర్బీఐనే ఓ నివేదికలో పేర్కొంది. ఆ తర్వాత బీవోబీ ప్రభావితమైంది.

### ఉద్యోగులపై పని ఒత్తిడి

శాఖల కుదింపుతో పాటు ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో పీఎస్‌బీల్లో పని చేసే ఉద్యోగులపై పని ఒత్తిడి పెరుగుతున్నది. అయినప్పటికీ, బీజేపీ సర్కారు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టట్లేదు. అంతటితో ఆగకుండా పీఎస్‌బీల బ్యాంకుల ప్రైవేటీకరణకు మొగ్గుచూపుతున్నది. ఈ క్రమంలోనే ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాలన్న విధానంతో దేశానికి మంచి కంటే హాని ఎక్కువ జరుగుతుందని ఆర్బీఐ హెచ్చరించింది. అయినప్పటికీ, కేంద్రం తన ఏకపక్ష విధానాలను వీడట్లేదు.




# ఎగుమతి అధోగతి



## కార్మిక శక్తితో నడుస్తున్న రంగాల్లో నైరాశ్యం

## దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, ప్లాస్టిక్స్ పరిశ్రమల్లో వెనుకబాటు

## రత్నాలు, ఆభరణాల ఇండస్ట్రీల్లోనూ నిరాశాజనక పరిస్థితులే

## గత ఐదేండ్లుగా నానాటికీ దేశీయ ఎక్స్‌పోర్ట్స్ తగ్గుముఖం

## భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య ఆందోళన

*అనేక రంగాల్లో భారత ఎగుమతులు నేలచూపులు చూస్తున్నాయి.*

*ముఖ్యంగా అత్యధిక స్థాయిలో కార్మికులు పనిచేసే దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, ప్లాస్టిక్స్, రత్నాలు-ఆభరణాల తయారీ రంగాల్లో ఎగుమతులు నిరాశాజనకంగా సాగుతున్నాయి.*

*కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో అండదండలు ఉండటం లేదని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఆయా రంగాల పరిశ్రమలు ప్రమాదంలో పడ్డట్టేనన్న ఆందోళనల్ని ఇప్పుడు భారతీయ ఎగుమతిదారుల సంస్థలు కనబరుస్తున్నాయి.*

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: దేశంలో కోట్లాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని అందిస్తున్న కీలక రంగాల్లో ఎగుమతులు నత్తనడకన సాగుతున్నాయి. దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, ప్లాస్టిక్స్, రత్నాలు-ఆభరణాల వంటి కార్మిక శక్తి అధికంగా ఉన్న రంగాలు నైరాశ్యంలోకి జారుకున్నాయి. ఈ రంగాల్లో అంతర్జాతీయ ఎగుమతుల్లో భారత్ వాటా గత ఐదేండ్లుగా అంతకంతకూ పడిపోతున్నది మరి. దీంతో భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఆయా రంగాల తీరు అధ్వాన్నంగా ఉంటున్నదని, ఎగుమతుల్లో మందగమనం స్పష్టంగా కనిపిస్తున్నదని ఎఫ్ఐఈవో చెప్తున్నది. ఈ నేపథ్యంలో రాబోయే సంవత్సరాల్లోనూ మెరుగుపడటం కష్టమేననిపిస్తున్నట్టు వ్యాఖ్యానించడం గమనార్హం.

### ఆదరణ కరువైంది..

దుస్తుల తయారీ, సముద్ర ఉత్పత్తులు, ప్లాస్టిక్స్, రత్నాలు-ఆభరణాల ఇండస్ట్రీపై ఆధారపడి దేశంలో ఎంతోమంది జీవిస్తున్నారని ఎఫ్ఐఈవో గుర్తుచేస్తున్నది. ఈ రంగాల్లో ఉద్యోగ-ఉపాధి సృష్టి గణనీయంగా ఉందని, నెట్ హై-వాల్యూ ఆడిషన్‌లో ఈ కంపెనీల వాటా కూడా ఎక్కువేనని, అయినప్పటికీ 1 నుంచి 2 శాతం వృద్ధికే పరిమితమవుతున్నాయని ఎఫ్ఐఈవో ఓ తాజా నివేదికలో తెలిపింది. నిజానికి వివిధ దేశాల్లో ఇదే రంగాల వృద్ధిరేటు ఆకర్షణీయంగా ఉందని గుర్తుచేస్తుండటం గమనించదగ్గ అంశంగా నిలుస్తున్నదిప్పుడు. అల్లిక దుస్తుల్లో అంతర్జాతీయ వాణిజ్యం 6 శాతంగా ఉంటే, భారత్ వృద్ధి కేవలం 2 శాతమేనన్నది.

**నేత వస్త్రాల్లో భారతీయ ఎగుమతుల వృద్ధి ఏండ్ల తరబడి 1 శాతం దిగువనే ఉంటున్నది. బంగ్లాదేశ్, వియత్నాం వంటి చిన్న దేశాల్లో కూడా 6 శాతం వరకు వృద్ధి నమోదవుతున్నది.**

**పాదరక్షల రంగంలో ప్రపంచ వాణిజ్య విస్తరణ 5 శాతందాకా ఉన్నది. భారత్ మాత్రం నిరాశపరుస్తున్నది. ఈ రంగంలో బంగ్లాదేశ్ వృద్ధి గత మూడేండ్లలో 1 బిలియన్ డాలర్ల నుంచి 1.7 బిలియన్ డాలర్లకు పెరిగింది. కానీ భారత్ 2.8 బిలియన్ డాలర్ల నుంచి 3 బిలియన్ డాలర్లనే తాకింది.**




**ఔషధ రంగంలో ఆశించిన స్థాయిలో వృద్ధి కనిపిస్తున్నా.. నాణ్యతా లోపాలు ప్రమాద ఘంటికల్ని మోగిస్తున్నాయి. దగ్గు మందు విషయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ ప్రతిష్ఠ దెబ్బతిన్నది.**

**మెషినరీ, ఆటో కంపోనెంట్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్నా.. సదరు మార్కెట్‌లో భారత్ వాటా ఇంకా ఒక్క శాతంగానే ఉన్నది.**

**ఈ ఏడాది ఆగస్టులోనూ భారతీయ వస్తూత్పత్తి ఎగుమతులు క్షీణించాయి. ఇలా పడిపోవడం వరుసగా ఇది ఏడో నెల. గతంతో పోల్చితే 6.86 శాతం దిగజారి 34.48 బిలియన్ డాలర్ల వద్దే నిలిచాయి. వాణిజ్య లోటు 10 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 24.16 బిలియన్ డాలర్లుగా ఉన్నది.**

**కార్మిక శక్తి ఎక్కువగా ఉన్న రంగాలపై ప్రభుత్వ దృష్టి లేకపోతే.. దేశంలో నిరుద్యోగ సమస్యకు దారితీస్తుంది. యావత్తు దేశ ఆర్థిక వ్యవస్థనే ఇది ప్రభావితం చేయగలదు.**

**ఈ ఏడాది ఏప్రిల్-ఆగస్టు మధ్య దేశ ఎగుమతులు గతంతో చూస్తే 11.9 శాతం పతనమై 172.95 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. జూలైలో ఏకంగా 15.88 శాతం క్షీణత కనిపించింది.**

**ఆగస్టు నెలలో టీ, కాఫీ, బియ్యం, సుగంధ ద్రవ్యాలు, తోలు, రత్నాలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో కానరాని వృద్ధిరేటు.**

### ప్రభుత్వ ప్రోత్సాహం కావాలి

కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతోనే ఆయా రంగాల్లో నూతనోత్సాహం వస్తుందని ఎఫ్ఐఈవో అంటున్నది. ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పోటీ వాతావరణంతో దేశీయ సంస్థలు లబ్ధి పొందాల్సిన అవసరం ఉన్నదని సూచిస్తున్నది. ఈ క్రమంలోనే ఉత్పాదక వ్యయం తగ్గేలా, నాణ్యత-కొత్తదనం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ఈ దిశగా సర్కారీ విధానాల్లో మార్పులు చేయాలన్న అభిప్రాయాలు పరిశ్రమ వర్గాల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి.

### ఆర్థిక మంత్రికి లేఖ

వచ్చే ఏడాది మార్చి 31దాకా ఎమర్జన్సీ క్రెడిట్ లింక్డ్ గ్యారంటీ స్కీంను పొడిగించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎఫ్ఐఈవో లేఖ రాసింది. ఎంఎస్ఎంఈ తయారీదారులకు 5 శాతం వడ్డీ రాయితీ ప్రయోజనాన్నీ పునరుద్ధరించాలన్నది.

*'చిన్నతరహా సంస్థలకు సులభంగా, చౌకగా రుణాలు అందాలి. ఎగుమతుల రవాణాకు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నుంచి మినహాయింపునివ్వాలి. తద్వారా మార్కెటింగ్‌కు ప్రభుత్వాలు దన్నుగా నిలవాలి. అప్పుడే దేశంలో ఉత్పాదకత, ఉపాధి కల్పన వేగంగా పెరిగేందుకు వీలుంటుంది.'*

***-ఏ శక్తివేల్, ఎఫ్ఐఈవో అధ్యక్షుడు***

# హెచ్‌పీతో కలిసి గూగుల్ క్రోమ్‌బుక్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: హెచ్‌పీతో కలిసి దేశీయంగా క్రోమ్‌బుక్స్ ఉత్పత్తి చేస్తున్నట్టు గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ ప్రకటించింది. చెన్నైకు సమీపంలోని ప్లాంట్లోనే తయారు చేస్తున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. దేశీయ విద్యార్థులకు తక్కువ ధరకు ఇవి లభించనున్నాయని, దేశీయంగా తయారైన తొలి క్రోమ్‌బుక్స్ ఇవేనని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ఈ సందర్భంగా తెలిపారు. నూతన క్రోమ్‌బుక్స్ ఆన్‌లైన్‌లో రూ.15,990 ప్రారంభ ధరలో లభించనున్నాయి.

# డౌన్‌లోడ్‌లో జెట్ స్పీడ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: మొబైల్ డౌన్‌లోడ్ స్పీడ్‌లో భారత్ గ్లోబల్ ర్యాంక్ 72 స్థానాలు ఎగబాకి 47కు చేరుకున్నట్టు ఒక్లా వెల్లడించింది. 5జీ సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత డౌన్‌లోడ్ 3.59 రెట్లు పెరిగినట్టు తెలిపింది.

# ఐక్వెస్ట్ చేతికి వియాట్రిస్ ఇండియా ఏపీఐ

హైదరాబాద్, అక్టోబర్ 2: హైదరాబాద్ ఆధారిత ఐక్వెస్ట్ ఎంటర్‌ప్రైజెస్.. అమెరికా ఔషధ రంగ దిగ్గజం వియాట్రిస్‌కు చెందిన భారత ఏపీఐ కార్యకలాపాలను కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నది. వచ్చే ఏడాది తొలి త్రైమాసికం నాటికి పూర్తి కానున్న ఈ ఒప్పందంలోని ఆర్థిక వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు. వైజాగ్ యూనిట్లు, హైదరాబాద్‌లోని ఏపీఐ తయారీ ప్లాంట్లతోపాటు నగరంలో ఉన్న ఆర్‌అండ్‌డీ కేంద్రం ఐక్వెస్ట్ చేతికి రానున్నాయని సంస్థ ఈడీ గునుపాటి స్వాతి రెడ్డి చెప్పారు.